క్లుప్తంగా

సీసీ రోడ్ల పరిశీలన



పాన్‌గల్: మండల కేంద్రంలో ఎస్‌డీఎఫ్ నిధులతో వివిధ కాలనీల్లో నిర్మించిన సీసీ రోడ్లను బుధవారం పీఆర్ ఏఈ సత్తయ్య పరిశీలించి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ సీసీ నిర్మాణాలు నిబంధనల మేరకు నాణ్యతతో నిర్మిస్తే బిల్లులు అందుతాయని, నిబంధనలు పాటించని కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపును నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ అనిల్, కాంట్రాక్టర్ పాల్గొన్నారు.

వధువు పెళ్లికి ఆర్థిక చేయూత



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని అమ్మపల్లికి చెందిన నర్సింహాగౌడ్ కూతురు స్వాతి పెళ్లికి ఎంపీపీ మేఘారెడ్డి రూ.10వేలు ఆర్థికసాయం అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. మండలంలో నిరుపేద కుటుంబాలకు చెందిన వారికి కుల, మతాలతో సంబంధం లేకుండా ఏ ఆపద వచ్చిన తన వంతు సహాయం అందజేసేందుకు ముందుంటానని ఎంపీపీ తెలిపారు. తమ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని పెళ్లి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేసిన ఎంపీపీ మేఘారెడ్డి వధువు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఐ.సత్యారెడ్డి, సాయిచరణ్‌రెడ్డి, నారాయణ, రాంచంద్రయ్య, యాదగిరి, తిరుపతి, శాంతన్న, బాలు, కేశవులు ఉన్నారు.

కడుకుంట్లలో చోరీ

వనపర్తి: నిద్రిస్తున్న సమయంలో తన ఆకు సంచిని చోరీ చేశారని మండలంలోని కడుకుంట్లకు చెందిన మంద ఎల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామరాజు బుధవారం వెల్లడించారు. రోజు వారీగానే.. మంగళవారం రాత్రి తన ఇంటి ఆవరణలో ఆరుబయట మంచంపై పడుకుంటే అదే కాలనీకి చెందిన ఓ వ్యక్తి తన ఆకుసంచిని చోరీ చేశాడని, అందులో రూ.2 వేల నగదు ఉన్నట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.

రెండ విడత లబ్ధిదారులకు అవగాహన

కోడేరు: మండలంలోని ఇంద్రకల్ రైతు వేదికలో బుధవారం మండల పశువైద్యాధికారి ఆధ్వర్యంలో రెండో విడత గొర్రెల పంపిణీ పథకంలో లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి రాజేష్‌కుమార్ మాట్లాడారు. ఎంపికైన లబ్ధిదారులు డాక్యుమెంటేషన్‌కు సంబంధించిన దరఖాస్తులు పూర్తి చేసేందుకు కులం, ఆధార్, బ్యాంకు అకౌంట్, నామిని వివరాలను పూర్తి చేసి పశువైద్య కార్యాలయంలో అందజేయాలన్నారు. లబ్ధిదారుల వాటాకు సంబంధించిన డీడీలు దరఖాస్తు వెంట జతచేయాలన్నారు. అనంతరం సింగిల్ విండో చైర్మన్ సమ్మద్‌పాష, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు బొడ్డు రమణ మాట్లాడారు. ప్రభుత్వం అందించే గొర్రెలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీటీసీ సబిత, ఆయా గ్రామాల లబ్ధిదారులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

పెద్దకొత్తపల్లి: మండలంలోని మారెడుదిన్నెలో మారెళ్ల మైసమ్మ ద్యాంకు వెళ్లే రహదారి రోడ్డు నిర్మాణానికి రూ.20 లక్షలతో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొన్నేళ్లు రోడ్డు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటుడటంతో ప్రజలను దృష్టిలో ఉంచుకొని రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. గ్రామాల అభివృద్ధి తమ ధ్యేయమని అన్నారు. మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

వైద్య పరీక్షలు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మికులకు సీపీసీ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య పరీక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా లేబర్ అధికారి వేణుగోపాల్ మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులందరూ కార్మిక కార్డులు తీసుకొని లబ్ధి పొందాలని చెప్పారు. కార్యక్రమంలో మహమూద్, భాస్కర్, అజయ్, వైద్య సిబ్బంది, పెంట్లవెల్లి గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడలను విజయవంతం చేయాలి

చిన్నచింతకుంట : మండల కేంద్రంలో ఈ నెల 16న నిర్వహించే క్రీడలను విజయవంతం చేయాలని ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి కోరారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో వారు సమావేశం నిర్వహించారు. జిల్లా క్రీడా శాఖ అధికారి శ్రీనివాసులు, తహసీల్దార్ సువర్ణరాజు, ఎంఈఓ లక్ష్మణ్ సింగ్ ఉన్నారు.

‘సర్కార్’ విద్యార్థుల దూకుడు



నిఖిత (10) సాయి (10) వసంత (9.5) మౌనిక (9.7) శ్రీలక్ష్మి (9.5) అస్మిత (10)
జానీగౌడ్ (9.7) రమేష్ (9.8) నవీన్ (9.7) అరవింద్ (9.8) అక్షయ (9.8) భానుశ్రీ (9.8)
భాను ప్రకాశ్ మన్యం (9.8) శ్రావ్య (9.5)

ఆత్మకూర్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గతేడాది కంటే బుధవారం విడుదలయిన పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం పెరిగినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈఏడాది 618 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయగా 518 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని ఎంఈఓ భాస్కర్‌సింగ్ పేర్కొన్నారు.

జూరాల విద్యార్థి ప్రతిభ

మండలంలోని జూరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యనభ్యసిస్తున్న చాకలి మన్యం 9.8 జీపీఏను సాధించి ఉమ్మడి మండల టాపర్‌గా నిలిచాడు. ఈసందర్భంగా సర్పంచ్ మహిమూద, ఎంపీటీసీ పరమేష్, ఎంఈఓ భాస్కర్‌సింగ్, హెచ్‌ఎం రాఘవేందర్, ఉపాధ్యాయులు సంతోష్‌కుమార్, షకీల్‌అహ్మద్, నాగప్రియ, భానుప్రియ, తహేరాబేగం, జయశ్రీ, నరేష్, గ్రామస్తులు మన్యంను అభినందించారు.

అమరచింత: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలు రాసిన 296 మంది విద్యార్థుల్లో మొత్తంగా 76 శాతం ఉత్తీర్ణత సాధించారని మండల విద్యాధికారి భాస్కర్‌సింగ్ తెలిపారు. పట్టణంలోని విజేత ఉన్నత పాఠశాలలో అస్మిత 10కి పది గ్రేడ్ సాధించగా.. అదే పాఠశాలకు చెందిన అరవింద్, అక్షయ 9.8 గ్రేడ్ సాధించారు. కేజీబీవీలో శ్రీలక్ష్మి 9.5, జెడ్పీహెచ్‌ఎస్ అమరచింతలో స్నేహ 9.0 గ్రేడ్ సాధించారని తెలిపారు.

మదనాపురం: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల నుంచి 84 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 48 మంది ఉత్తీర్ణత సాధించారు. కొన్నూర్ జెడ్పీ పాఠశాల నుంచి 24 మందికి 20 మంది, అజ్జకొల్లు జిల్లా పరిషత్ పాఠశాలలో 22 మందికి గాను 13 మంది, దుప్పల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో 46 మంది విద్యార్థులకు గాను 23 మంది, మదనాపురం కేజీబీవీలో 42 మంది విద్యార్థులకు గాను 41 మంది, సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో నుంచి 72 మంది విద్యార్థులకు గాను 69 మంది ఉత్తీర్ణత సాధించారు. మదనాపురం గ్రామానికి చెందిన భానుప్రకాశ్ 9.7 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచారు.

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని మద్దిగట్ల జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన భానుశ్రీ 9.8 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచింది. మండలంలో ఆరు జెడ్పీహెచ్, కేజీబీవీ, ట్రైబల్ వెల్ఫేర్ బాలుర, సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలల్లో కలిపి 422మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 354మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ జయశంకర్ తెలిపారు.

పాన్‌గల్‌లో 90.42 శాతం

పాన్‌గల్: మండలంలో పదో తరగతి ఫలితాల్లో 90.42 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ పేర్కొన్నారు. మండలంలో 10 ఉన్నత పాఠశాలలు, ఒక కస్తూర్బా విద్యాలయంతో కలిపి మొత్తం 397 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వారిలో 359 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. పాన్‌గల్ బాలుర ఉన్నత పాఠశాలల్లో తెలుగు మీడియంలో 34 మందికి 30 మంది, ఇంగ్లిష్ మీడియంలో 51 మందికి 47, పాన్‌గల్ బాలికల ఉన్నత పాఠశాలలో 18 మందికి 17, కేతేపల్లి ఉన్నత పాఠశాల తెలుగు మీడియంలో 21 మందికి 17, ఇంగ్లిష్ మీడియంలో 33 మందికి 32, రేమద్దుల ఉన్నత పాఠశాలల్లో 37 మందికి 30 మంది, శాగాపూర్ ఉన్నత పాఠశాలలో 17 మందికి 14, మాందాపూర్ ఉన్నత పాఠశాల తెలుగు మీడియంలో 26మందికి 22, ఇంగ్లిష్ మీడియంలో 13 మందికి 13 మంది, బుసిరెడ్డిపల్లిలో 29మందికి 28 మంది, చిక్కేపల్లిలో 11 మందికి 9 మంది, కదిరెపాడులో 11 మందికి 10 మంది, చింతకుంటలో 28 మందికి 26మంది ఉత్తీర్ణత, కస్తూర్బా విద్యాలయంలో 41మందికి 31 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ పేర్కొన్నారు. కేతేపల్లి ఉన్నత పాఠశాలలో రమేష్ 9.8 జీపీఏ, పాన్‌గల్ బాలుర ఉన్నత పాఠశాలలో వసంత 9.5 జీపీఏలతో మండలంలో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచారు.

పెబ్బేరు: పట్టణంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో 96 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 86 మంది ఉత్తీర్ణత సాధించారు. సాయికి 10గ్రేడ్, నిఖితకు 10 గ్రేడ్ మార్కులతో సత్తా చాటారు.

ఖిల్లాఘనపురం: తెలంగాణ మోడల్ పాఠశాల విద్యార్థులు మౌనిక, జానీగౌడ్, నవీన్ 9.7 జీపీఏతో మండల టాపర్లుగా నిలిచారు. అదే పాఠశాలకు చెందిన శ్రావ్య 9.5, శిల్ప 9.3 జీపీఏలతో మండల స్థాయిలో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. మండలంలో మొత్తం 6 ఉన్నత పాఠశాలలు, రెండు కస్తూర్బాగాంధీ, ఎస్టీ ఆశ్రమ పాఠశాల, తెలంగాణ మోడల్ పాఠశాలలకు గాను మొత్తం 445 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 335 మంది ఉత్తీర్ణులయ్యారని మండల విద్యాధికారి ఉషారాణి తెలిపారు. మండలంలోని తెలంగాణ మోడల్ పాఠశాల 92.63 శాతం ఉత్తీర్ణత సాధించి ప్రథమ స్థానంలో నిలవగా.. 87.50 శాతం ఉత్తీర్ణత శాతంతో తెలుగుమీడియం కస్తూర్బాగాంధీ పాఠశాల ద్వితీయ స్థానం, 84.44 శాతం ఉత్తీర్ణతతో మండల కేంద్రంలోని ఇంగ్లిష్‌మీడియం కస్తూర్బాగాంధీ పాఠశాల తృతీయ స్థానంలో నిలిచాయి.

మండలంలో 99 శాతం ఉత్తీర్ణత

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలో 148 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 147 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ జయరాంలు తెలిపారు. మండల కేంద్రంలోని బాలుర పాఠశాలల్లో 78 మందికి 77 మంది, కేజీబీవీలో 43 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 43 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత సాధించారు. శ్రీరంగాపూర్ బాలికల పాఠశాల, వెంకటాపురం, నాగసానిపల్లి జెడ్పీ పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి.

గురుకుల పాఠశాలలో 94.94 శాతం

గోపాల్‌పేట: బుద్దారం గురుకుల పాఠశాలలో 94.94 శాతం, ఏదుట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 74.5 శాతం, పొలికెపాడు పాఠశాలలో 66.6 శాతం, గోపాల్‌పేట బాలికల పాఠశాలలో 46 శాతం, కేజీబీవీ పాఠశాలలో 67.64 శాతం, ఏదులలో 83 శాతం ఉత్తీర్ణత సాధించారని ఎంఈఓ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ గాయత్రి

ఆత్మకూర్: మున్సిపాలిటీ అభివృద్ధిలో పట్టణ ప్రజలు భాగస్వాములు కావాలని చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు అన్నారు. బుధవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వర్కర్లకు జీతాలు, శానిటేషన్‌కు సంబంధించిన నిధుల విడుదల, ఇతర అభివృద్ధి పనులపై తీర్మానాలు ప్రవేశపెట్టారు. పట్టణంలో రోడ్డు డివైడర్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, రోడ్డుకు ఇరువైపులా సీసీరోడ్ల నిర్మాణ పనులు వారం రోజుల్లోగా ప్రారంభిస్తామని సభ తెలిపారు. స్థానికులు సకాలంలో పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం ఇక్కడ కమిషనర్‌గా పనిచేసి బదిలీపై వెళ్లిన బీఎస్‌కే రమేష్‌ను, నూతన బాధ్యతలు చేపట్టిన నాగరాజును పూలమాలలు, శాలువాలో సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చెన్నయ్య, అశ్విన్ కుమార్, మహేశ్వరి, పోషన్న, నాగలక్ష్మి, మండ్లరామకృష్ణ, తబస్సూంమోసీన్, కోఆప్షన్ సభ్యులు రియాజ్‌అలీ, కిషన్‌చంద్, షాహీన్‌బేగం, జ్యోతి మల్లేష్, సిబ్బంది ఉన్నారు.



రమేష్‌ను సన్మానించిన తహసీల్దార్ సింధూజ

కమిషనర్‌ను సన్మానించిన తహసీల్దార్

ఆత్మకూర్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టి బదిలీపై వెళ్తున్న బీఎస్‌కే రమేష్‌ను తహసీల్దార్ సింధూజ పూలమాల, శాలువాతో సన్మానించారు. ఆత్మకూర్ మున్సిపాలిటీ అభివృద్ధిలో అందరిని భాగస్వామ్యం చేస్తూ ముందుకువెళ్లారని అభినందించారు. అలాగే పురపాలిక ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపాలిటీ సిబ్బంది ఘనంగా సత్కరించారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

వనపర్తి: మండలంలోని చిట్యాలలో రేకుల షెడ్‌ను రైస్‌మిల్లుగా చిత్రీకరించి సీఎంఆర్ పొందిన, మంజూరుకు సహకరించిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోకుంటే.. ఆందోళన చేస్తామని బీజేపీ నాయకులు బి.కృష్ణ, వెంకటేశ్వర్‌రెడ్డి, పెద్దిరాజు తదితరులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో ఏసీఎస్‌ఓ వినోద్‌ను కలిసి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. కనీసం మిషన్లు కూడా ఏర్పాటు చేయకుండానే.. వడ్లను బియ్యంగా ఎలా మార్చి ఇస్తారని సీఎంఆర్ కేటాయింపులు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.

అత్తపై అల్లుడు దాడి: కేసు నమోదు

గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని గొల్లపల్లిలో అత్తపై అల్లుడు దాడి చేయడగా బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రేవల్లి ఎస్‌ఐ శివకుమార్ తెలిపిన వివరాల మేరకు.. గొల్లపల్లికి చెందిన చందుకుమార్ అదే గ్రామానికి చెందిన పోతుగంటి లక్ష్మి కుమార్తెను మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇటీవల చందుకుమార్ భార్యతో గొడవపడి ఆమె కొట్టాడు. దీంతో తన కుమార్తెను ఎందుకు కొట్టావని నిలదీసిన అత్తను సైతం కొట్టాడు. దీంతో పోతుగంటి లక్ష్మి బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నూతన భవనం ఏర్పాటు

చిన్నచింతకుంట : ఖాతాదారులకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు యూనియన్ బ్యాంకు నూతన భవనం ఏర్పాటు చేసినట్లు ఏజీఎం శ్రీనివాస మూర్తి తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ సోమని, బ్రాంచ్ మేనేజర్ నరసింహారాజు, సర్పంచ్ మోహన్‌గౌడ్, ఎస్సై మోహన్‌బాబు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో ఏఈ లేక అవస్థలు



మున్సిపల్ కార్యాలయం సమీపంలో కాలిపోయిన బోర్‌మోటార్‌ను బయటికి తీస్తున్న సిబ్బంది

- బోర్ మోటారు మరమ్మతు
- తాగునీటికి తప్పనిపాట్లు



అమరచింతలోని ఎనిమిదో వార్డులో ట్యాంకర్‌తో తాగునీటిని అందిస్తున్న సిబ్బంది

అమరచింత: మున్సిపాలిటీలో ఏఈగా విధులు నిర్వహిస్తున్న ధర్మరాజు ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లడం, మున్సిపాలిటీకి కొత్తగా ఏఈ నియామకం కాకపోవడంతో సమస్యలు నెలకొంటున్నాయి. పట్టణంలో ప్రతి పనికి ఏఈ సేవలు తప్పనిసరి కావడంతో అభివృద్ధి పనులు సైతం మరుగున పడుతున్నాయి. వారం రోజుల కిందట వీచిన ఈదురు గాలులు, అకాల వర్షాలకు విద్యుత్ సరఫరాలో ఏర్పడిన హెచ్చు తగ్గుల వల్ల తాగునీటి సోర్సుబోర్ మోటార్లు కాలిపోవడంతో పట్టణంలోని ఎనిమిదో, ఒకటో వార్డులో తాగునీటి ఎద్దడి ఏర్పడింది. దీంతో ఆయా వార్డులకు మున్సిపాలిటీకి చెందిన వాటర్ ట్యాంకర్ ద్వారా కాలనీలకు తాగునీటిని సరఫరా చేస్తున్నా.. అందరికీ నీరు అందక ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. బోరు మోటార్ల మరమ్మతుకు ఏఈ పరిశీలనలో బిల్లులు చేయాల్సి ఉండగా ప్రస్తుతం సమస్యను పట్టించుకోలేక పోతున్నారు. తాగునీటి సమస్యతో పాటు నర్సరీ నిర్వహణ, ఇతర పనులను సైతం మున్సిపల్ కమిషనర్ దగ్గరుండి పరిశీలిస్తున్నా.. వీటికి సంబందించిన బిల్లులు, ఎంబీలు చేయడం ఏఈకే అనుమతులు ఉంటాయని, అందుకే పనులు ముందుకు సాగడం లేదని కమిషనర్ తెలిపారు. తమ మున్సిపాలిటీకి ఏఈని నియమించాలని కలెక్టర్‌కు విన్నవించామని ఏఈ వచ్చే వరకు ఇబ్బందులు తప్పవని కమిషనర్ మహమ్మద్ ఖాజా అన్నారు. పట్టణంలో శానిటరీ నిర్వహణ, మురుగుకాల్వల పరిశీలన వంటి పనులను సైతం ఉన్న సిబ్బందితో నిర్వహిస్తున్నామని త్వరితంగా ఏఈ సమస్యను పరిష్కరించి పట్టణంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

తల్లిదండ్రులను పోషించడం బాధ్యత



మాట్లాడుతున్న రాజారామ్‌ప్రకాశ్

వనపర్తి టౌన్: తల్లిదండ్రులను పోషించకుంటే జైలు శిక్ష అనుభవించే చట్టాలు ఉన్నాయని ప్రజా వాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమను పోషించడం లేదని చట్టం ముందు నిలబడే స్థాయికి పిల్లలు తెచ్చుకోవడం సమాజానికి శ్రేయస్కరం కాదన్నారు. తల్లిదండ్రులను పూజించాలని అనాధిగా పెద్దలు, సంస్కృతి సంప్రదాయాలు నొక్కి చెబుతున్నాయని, పూజించకపోయిన గౌరవించే స్థితికి నేటి తరాన్ని తీర్చిదిద్దడంలో సమాజం కీలక పాత్ర పోషించాలని అభిప్రాయపడ్డారు. వనపర్తి శివారులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ‘అమ్మ’ వైభవంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాజారామ్‌ప్రకాశ్ మాట్లాడుతూ.. వస్తులు ఉండైన సరే పిల్లల బాగోగుల కోసం పరితపించే నిత్య ప్రేమికులు తల్లిదండ్రులని చెప్పారు. అమ్మను మించిన దైవం, తండ్రిని మించిన ధర్మం ఇలలో లేదన్నారు. ఆస్తిపాస్తులు ఆశించని నిస్వార్థమైన తల్లిదండ్రులు పట్టెడన్నం కోసం ప్రయాస పడే దుస్థితి సమాజంలో శాశ్వతంగా మారాల్సి అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బక్కన్న, అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్లు రాజేశ్వరి, సతీష్ కుమార్, చెన్నయ్య, ప్రవీణ్, కిష్టయ్య, కళాకారుడు నందిమల్ల డప్పు నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపక బృందం

వనపర్తి టౌన్: ఈనెల 9వ తేదీన ప్రకటించిన ఐపీఈ 2023 ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఫలితాల్లో అన్ని గ్రూపుల్లో స్కాలర్స్ విద్యార్థులు అత్యధిక మార్కులను సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు ఫస్ట్, సెంకడ్ ఇయర్‌లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల బృందం బుధవారం బొకేలతో అభినందించారు. ఈ సందర్భంగా సెకండ్ ఇయర్ ఎంపీసీలో ఇందు 985, గాయత్రి 982, అక్షయ 981, అఖిల 980, బీపీసీలో అంజలి 985, ప్రణతిషిండే 983, ఎంఈసీలో శ్వేత 972, సీఈసీలో అక్షయ 954 మార్కులు, ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో ప్రశాంతి 465, లావణ్య 464, కీర్తి 464, బైపీసీలో నందిని 434, అరుణ 433, సుమయ్యనూర్ 432, మౌనిక 432, తహినియాత్ కౌసర్ 431, ఎంఈసీలో శౌ 478, సీఈసీలో వర్ష 463 మార్కులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధిచడంలో కళాశాల చదువే కాకుండా తల్లిదండ్రుల ప్రోత్సహం కారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ వరప్రసాద్‌రావు, నాగేశ్వర్‌రెడ్డి, డాక్టర్ సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట ఆలయంలో కొనసాగుతున్న ప్రత్యేక పూజలు



హోమం చేస్తున్న పూజారులు

పాన్‌గల్: మండలంలోని కొత్తపేట గ్రామ ఆంజనేయ స్వామి ఆలయంలో నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠా కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం నవగ్రహ జపాలు, నవగ్రహ హోమం, ధాన్యదివాసం, మూలదేవతార్చన, మంగళహారతి, తీర్థ ప్రసాద గోష్టి కార్యక్రమం నిర్వహించారు. గురువారం ఆలయంలో నవ గ్రహ విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ పూజ కార్యక్రమాలు బీఆర్‌ఎస్ నాయకుడు దిండిరామస్వామి ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాలకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రతి ఒక్కరికీ సీపీఆర్‌పై అవగాహన ఉండాలి



సీపీఆర్‌పై వివరిస్తున్న డాక్టర్ మంజుల

అమరచింత: గుండెపోటుతో ఆకస్మికంగా ప్రాణాపాయ స్థితికి చేరిన వ్యక్తిని సీపీఆర్ విధానంతో త్వరితంగా కోలుకునేలా చెయొచ్చని డాక్టర్ పరిమళ, డాక్టర్ మంజుల తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ చొరవతో అన్ని మండలాల్లో ప్రభుత్వ రంగ సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు సీపీఆర్ విదానం గురించి అవగాహన కల్పిస్తున్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో సీపీఆర్ గురించి అధికారులకు వివరించారు. ప్రమాదకర పరిస్థితులలో స్పృహ కోల్పోయిన వారి ఛాతి భాగాన్ని రెండు చేతులతో బలంగా నొక్కడం ద్వారా గుండె కొట్టుకులా చేయొచ్చన్నారు. సీపీఆర్ విధానాన్ని నేర్చుకోవడమే కాకుండా తమ పరిసరాల్లో ఉన్న యువత తెలియచేస్తూ వారిలో చైతన్యం కలిగించాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, తమ తమ పరిధిలోని ప్రతి ఒక్కరికీ వీటి గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు శరత్, నిస్సార్, తహసీల్దార్ చాంద్ పాషా, ఎంపీడీఓ జ్యోతి, ఎస్‌ఐ శివనాగేశ్వర నాయుడు, హెల్త్ సూపర్ వైజర్ సురేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: స్థానిక ఎంపీడీఓ, మున్సిపాలిటీ కార్యాలయాల్లో ప్రజాప్రతినిధులు, పోలీసులు, ఆయా శాఖల అధికారులకు సీపీఆర్ చేసే విధానంపై బుధవారం వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. గుండె పోటుకు గురైన బాధితుల పల్స్ చెక్ చేసిన అనంతరం సీపీఆర్ చేయాలని డాక్టర్ పరిమళ, డాక్టర్ మంజుల అన్నారు. ఈసందర్భంగా ఒక్కరికి సీపీఆర్ చేసే విధానంపై క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, వైద్యులు శరత్, నిస్సార్‌అహ్మద్, హెల్త్‌సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

సరస్వతీ దేవికి బోనంతో నైవేద్యం



సరస్వతీ దేవికి బోనమెత్తిన చిన్నారులు, మహిళలు



పండ్లతో తులాబారం

గోపాల్‌పేట: మండలంలోని ఏదులలో 2016 సంవత్సరం నుంచి వస్తున్న ఆచారంలో భాగంగా బుధవారం ఏదుల గ్రామస్తులు సరస్వతీ దేవికి బోనమెత్తి వారి పిల్లలు చదువుల్లో రాణించాలని మొక్కులు తీర్చుకున్నారు. మొదట ఇళ్లలో తయారు చేసిన ప్రత్యేక వంటకాన్ని బోనంలో నింపి చిన్నారులు, మహిళలు బోనం తీసుకుని ఊరేగింపుగా గట్టుపై ఉన్న ఆలయం వద్దకు తీసుకువెళ్లి సరస్వతీ దేవికి నైవేద్యం సమర్పించారు. అనంతరం నైవేద్యాన్ని ఒకరికొకరు పంచుకున్నారు. ఆతర్వాత చిన్నారులకు పండ్లతో తులాభారం కార్యక్రమం నిర్వహించారు. కులమతాలకు అతీతంగా ఈ ఆనవాయితీ కొనసాగిస్తున్నామని గ్రామస్తులు తెలిపారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

కోడేరు: ప్రజా సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రం నుంచి డబుల్‌లైన్ బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.7.50 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నాగులపల్లిలో రూ.2.10 కోట్లతో నాగులపల్లి నుంచి రాజాపూర్ వెళ్లే బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని చెప్పారు. అనంతరం ముత్తిరెడ్డిపల్లి బ్రిడ్జి నిర్మాణానికి రూ.2.45 కోట్ల నిధులు మంజూరు కావడంతో పనులకు భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడారు. సీఎం కేసీఆర్, కేటీఆర్ సహకారంతో కొల్లాపూర్ నియోజకవర్గంలో ఎన్నో దశాబ్దాల కాలంగా పెండింగ్‌లోని పనులకు శంకుస్థాపన చేస్తూ.. పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో కోడేరు మండలం వెనుకబాటుకు గురైందని, ఇప్పుడు తన హయాంలో అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. అనంతరం మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి చెక్కులు, తుర్కదిన్నెలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులు మధ్యదళారులను ఆశ్రయించకుండా వరి కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాలని సూచించారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సింగిల్‌విండో చైర్మన్ చిన్నారెడ్డి, డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ సునీత, రఘువర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్‌నాయక్, సర్పంచ్ వెంకటస్వామి, జగదీశ్వర్‌రావు పాల్గొన్నారు.